క్లుప్తంగా

డ్రైవర్లు అప్రమత్తంగా విధులు నిర్వహించాలి


ముఖం శుభ్రం చేసుకుంటున్న డ్రైవర్

శ్రీకాళహస్తి: వాహన డ్రైవర్లు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని బుచ్చినాయుడుకండ్రిగ ఎస్ఐ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రమాదాలను నివారించేందుకు ఆదివారం వేకువజామున పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయ కూడలి వద్ద వాహనాలు నిలిపి డ్రైవర్ల ముఖాన్ని చల్లని నీటితో శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

పోలీసుల దృష్టికి తీసుకురండి


వాకర్స్‌తో మాట్లాడుతున్న సీఐ గోపి

శ్రీకాళహస్తి: పట్టణ పరిసర ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరిగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని 1వ పట్టణ సీఐ గోపి అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు వద్ద వాకర్స్, స్థానికులతో మాట్లాడారు. ప్రజలు పట్టణంలో శాంతియుత వాతావరణానికి సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

పేదలకు సరుకుల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి: రంజాన్ పురస్కరించుకుని పట్టణంలోని హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు మునీర్‌బాషా ఆధ్వర్యంలో ఆదివారం పేదముస్లింలకు నిత్యావసర సరుకులు, నూతన దుస్తులు, ఆర్థిక సాయం అందజేశారు. దీనికి డీఎస్పీ నరసింహమూర్తి హాజరై వాటిని పేద ముస్లింలకు అందజేశారు. మునీర్‌బాషా దాతృత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో ఒకటో పట్టణ గోపి, సంస్థ సభ్యులు రాజేశ్వరరావు, రమేష్‌బాబు, కంఠా ఉదయ్, హరినాయుడు, బాబాఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

కార్డన్ సెర్చ్


తనిఖీలు చేస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని కొండమిట్ట ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున 1వ పట్టణ సీఐ గోపి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆ ప్రాంతంలో నివసిస్తున్న అనుమానిత వ్యక్తుల గృహాలను తనిఖీ చేశారు. పలు వాహనాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాలీ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: మండలంలోని యానాదివెట్టు వద్ద సత్యవేడు–కదూరు ప్రధాన రోడ్డు మార్గంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్రాక్టర్ ట్రాలీని తొలగించారు. రోడ్డుకు అడ్డంగా ట్రాలీ అనే శీర్షికతో ఈ నెల 21న సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనంపై ఎస్ఐ మల్లికార్జున స్పందించారు. ఆ ట్రాక్టర్ ట్రాలీ యజమానితో మాట్లాడి ఆ ప్రాంతం నుంచి ట్రాలీని తొలగించారు.

కార్మికుల ఉపాధికి తాళం

స్వేద బిందువు చిందించి వారు పత్తి నుంచి వడికిన దారం ఎన్నో తనువులకు కవచంగా నిలిచింది.. అయితే విధి వెక్కిరించింది... నాలుగేళ్ల క్రితం పరిశ్రమ మూత పడడంతో ఉపాధి విచ్ఛిన్నమైంది. జీవనం భారమై బతుకు బండి లాగడం సవాలుగా మారి దైన్యపు బతుకులు వెళ్లదీస్తున్నారు వారంతా... కేంద్ర జౌళిశాఖ సారథ్యంలో నడుస్తున్న తిరుపతి కాటన్‌మిల్లు ఒకప్పుడు దేదీప్యమానంగా వెలిగింది. వందలాది మంది కార్మికుల పాలిట వటవృక్షమైంది. కరోనా సాకు చూపి మూసుకున్న పరిశ్రమ గేట్లు మళ్లీ తెరుచుకోలేదు. తెరుచుకునే మార్గం దగ్గర్లో కానరాకపోవడంతో అక్కడ పనిచేసే కార్మికుల బతుకుల్లో అంధకారం అలుముకుంది.



తిరుపతి కాటన్‌మిల్లు ప్రవేశద్వారం

- తిరుపతి కాటన్‌మిల్లు మూసివేతతో వీధిన పడ్డ కార్మికులు
- ఐదేళ్లుగా సగం వేతనంతో జీవనం నెట్టుకొస్తున్న వైనం
- బూత్‌బంగ్లాలను తలపిస్తున్న క్వార్టర్స్ గదులు
- అరణ్యరోదనగా మారిన కార్మికుల ఆవేదన

రేణిగుంట: తిరుపతి కాటన్ మిల్స్ పేరుతో 1957, ఆగస్టు 29న అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి చేతుల మీదుగా రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ ఎస్ఎస్ పురం(సూర్య నారాయణపురం)లో నూలు ఉత్పత్తి పరిశ్రమ ప్రారంభమైంది. ఈ పరిశ్రమకు ప్రభుత్వం 82 ఎకరాలు భూమిని కేటాయించింది. 1974 నుంచి కేంద్ర జౌళిశాఖ ఆధీనంలో ఈ పరిశ్రమ నడుస్తోంది. ప్రారంభంలో 600మందికి పైగా రెగ్యులర్ కార్మికులు, మరో 300మంది క్యాజువల్ కార్మికులు పని చేస్తూ దేశస్థాయిలో తిరుపతి కాటన్‌మిల్లుకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారు. మూతబడే వరకు ఇక్కడ ఏడాదికి రూ.20 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే దారానికి ముడి సరుకు పత్తిని కేంద్ర జౌళిశాఖ సరఫరా చేసేది. అయితే క్రమేణా సరఫరా అయ్యే పత్తిలో నాణ్యత లోపించడంతో ఇక్కడి దారానికి కూడా గిరాకీ తగ్గింది. దీనికితోడు ఇక్కడ 1980 నాటి యంత్ర పరికరాలే ఉండడంతో ప్రస్తుత టెక్స్‌టైల్స్ రంగంలో నెలకొన్న సాంకేతికతను ఈ ఉత్పత్తులు అందుకోలేకపోయాయి. అయినప్పటికీ నష్టాలు లేకుండా కార్మికుల కష్టంతో పరిశ్రమను నెట్టుకొచ్చేలా చేసింది. అయితే 2020 మార్చి చివర్లో కరోనా లాక్‌డౌన్ సాకు చూపి ఉన్నపళంగా కాటన్‌మిల్లును తాత్కాలికంగా మూసివేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఫ్యాక్టరీలో పని చేస్తున్న 350మంది కార్మికులకు ఉపాధి పోయింది. కరోనా పరిస్థితులు తగ్గాక మళ్లీ ఫ్యాక్టరీ తెరుస్తారులే.. అని ఊహించిన కార్మికుల ఆశలు క్రమేణా నీరుగారిపోయాయి. కేంద్ర జౌళి శాఖ నుంచి పరిశ్రమ పునఃప్రారంభానికి అనుమతులు రాకపోవడంతో కార్మికులు ఇప్పటికే పలుమార్లు రోడ్డెక్కారు. అయితే 114మంది రెగ్యులర్ కార్మికులకు మాత్రం రూ.6వేలు, రూ.7వేలు చొప్పున సగం వేతనం పేరుతో మూడు, నాలుగు నెలలకు ఒక సారి చెల్లిస్తున్నారు. దీంతో కార్మికులు ఉపాధి కరువై నానాటికీ జీవన ప్రమాణస్థాయి క్షీణావస్థకు చేరడంతో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు చూశారు. కొందరు రోజువారీ కూలీ చేసుకుంటుంటే, మరి కొందరు వయసు మీదపడి పని దొరక్క అగచాట్లు పడుతున్నారు.

బూత్ బంగ్లాలను తలపిస్తున్న క్వార్టర్స్

పరిశ్రమ ప్రారంభంలో ఫ్యాక్టరీ సమీపంలో నిర్మించిన 250 కార్మికుల నివాస గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. చినుకు పడితే నీటిబొట్లను రాల్చే పైకప్పు.., గట్టిగా గాలి వీస్తే కూలిపోయే గోడలు... కనీసం మరుగుదొడ్డి కూడా లేని ఆవాసం... దెయ్యాలు కూడా ఉండలేని గూళ్లలో బిక్కుబిక్కుమంటూ ఇక్కడి కార్మికులు నరకప్రాయపు బతుకులను వెళ్లదీస్తున్నారు. ఆరుబయటకు వెళ్లాలంటే ముళ్ల పొదల మాటును వెతుక్కునే దుస్థితి ఇక్కడి మహిళలది. సౌకర్యాలను కల్పించాలని పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం శూన్యం.


తిరుపతి కాటన్‌మిల్లులోని యంత్ర పరికరాలు


శిథిలావస్థలో కార్మికుల వసతి గృహ సముదాయాలు

ప్రభుత్వాలు పట్టించుకోవాలి



నేను 17ఏళ్లుగా కాటన్‌మిల్లులో పని చేస్తున్నా. ఫ్యాక్టరీ లాభాల్లోనే నడుస్తున్నప్పుడు కరోనా సాకు చూపి తాత్కాలికంగా మూసివేశారు. అయితే మళ్లీ తెరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులివ్వలేదు. ఎంపీని కలిసి మా సమస్య వివరించాం. ప్రభుత్వాలు స్పందించి, తిరుపతి కాటన్‌మిల్లును పునఃప్రారంభించాలి. క్వార్టర్స్‌ను పడగొట్టి నూతన గృహ సముదాయాలను నిర్మించి మా బతుకులకు భరోసా ఇవ్వాలి.

–జ్ఞానశేఖర్, కాటన్‌మిల్లు కార్మికుడు, ఎస్ఎస్ పురం, రేణిగుంట మండలం

కారిపాకంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

వరదయ్యపాళెం: మండలంలోని కారిపాకంలో పంచాయతీ కార్యాలయ ప్రాంగణం వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఆదివారం ఉదయం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా కృష్ణస్వామి జయచంద్రన్. టి. వరప్రసాదరావు, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ జయభీం బాలకృష్ణ, దిండు కృష్ణయ్య, డి. విజయ్‌కుమార్ తదితరులు విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. స్థానిక సర్పంచ్ ఆనంద్, కారిపాకం అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

శ్రీ వ్యాసాశ్రమ అభివృద్ధికి సమష్టి కృషి

ఏర్పేడు(రేణిగుంట): శ్రీ వ్యాసాశ్రమ అభివృద్ధికి పూర్వ విద్యార్థులందరూ సమష్టి తోడ్పాటునందిస్తామని స్పష్టం చేశారు. తిరుపతిలో ఆదివారం వారు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని వ్యాసాశ్రమ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులుగా రమణారెడ్డి, గౌరవ అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శిగా బలరామరాజు, సలహాదారులుగా టి.చెంగయ్య(రిటైర్డ్ డీఈవో), 65మంది కమిటీ సభ్యులు సమావేశంలో పాల్గొని పలు తీర్మానాలు చేశారు. ఈ ఏడాది జరగనున్న వ్యాసాశ్రమ శతజయంతి ఉత్సవానికి పూర్వ విద్యార్థులు సహకరిస్తామని తెలియజేశారు. సమావేశంలో అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ శ్రీ వ్యాసాశ్రమంలో అందరికీ ప్రవేశం జరిగేలా పరిస్థితులు తీసుకురావాలని అన్నారు. ఆశ్రమంలో విద్య, ఆధ్యాత్మిక అభివృద్ధికి నిర్మాణాత్మకమైన కృషి చేసి ఆశ్రమానికి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామిని ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.


వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మంగళగుంట చెరువు కట్ట కబ్జా


కబ్జాకు గురవుతున్న మంగళగుంట చెరువుకట్ట

శ్రీకాళహస్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తొట్టంబేడు మండలంలో కబ్జాలు కొనసాగుతున్నాయి. మండలంలోని చిన్న కనపర్తి గ్రామం మంగలిగుంట చెరువు కట్టను కబ్జా చేసేశారు. సుమారు 15 రోజుల కిందట రాత్రికి రాత్రి జేసీబీతో బలంగా ఉన్న చెరువు కట్టను కుదించేశారు. గతంలో ఈ చెరువు కట్ట వద్ద కొన్ని ఏళ్ల కిందట తెలుగు గంగ కాలువ తెగిపోయింది. మంగలిగుంట చెరువు పూర్తిగా కబ్జాకు గురై పూర్తిగా కనుమరుగైపోయింది. చెరువు కట్ట గడ్డివాములు, పేడ దిబ్బలతో దర్శనమిస్తోంది. చెరువు కట్టను పూర్తిగా కుదించేసి సుమారు 50 సెంట్ల భూమి వరకు కబ్జాకు గురైనట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెరువు తూము ద్వారా పంట కాలువలకు నీరు అందాల్సి ఉంది. అయితే కాలువ కూడా కబ్జా కావడంతో నీరు ఎటూపోని పరిస్థితి ఏర్పడింది. చెరువు కట్ట కబ్జాకు గురవుతున్న ఇరిగేషన్ శాఖ అధికారులు ఏమి పట్టించుకోవడంలేదని విమర్శలు ఉన్నాయి. ఇరిగేషన్ శాఖ అధికారులు అవినీతి ఊబిలో కూరుకుపోయి మండలంలోని చెరువుల గురించి పట్టించుకోవడం లేదని పలువురు రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేడు రైతు సదస్సు

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు సబ్‌స్టేషన్ ప్రాంగణంలో సోమవారం ఉదయం 10 గంటలకు విద్యుత్ వినియోగదారులతో రైతు సదస్సు నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయ్ వెంకటేష్ ఆదివారం తెలిపారు. గృహ, వ్యవసాయ వినియోగదారులు హాజరై సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. అలాగే నూతనంగా గ్రామీణ ప్రాంతాల గృహావసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన 3–ఫేజ్ ఫీడర్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ సదస్సులు

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలో సోమవారం, మంగళవారాల్లో రైతులకు, వినియోగదారులకు విద్యుత్ సమస్యలపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం పిచ్చాటూరు, వేలూరు సబ్ స్టేషన్ పరిధిలో, మంగళవారం గోవర్ధనగిరి, కారూరు సబ్ స్టేషన్ పరిధిలో సదస్సు నిర్వహించనున్నారు.

సర్పంచ్‌కు మాతృ వియోగం


చిన్నపాపమ్మ(ఫైల్)

నారాయణవనం: మండలంలో వెంకటకృష్ణపాళ్యం పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ధర్మలింగం తల్లి చిన్నపాపమ్మ(65) మధుమేహం మూలాన తీవ్ర అస్వస్థతకు గురై ఆదివారం మృతి చెందారు. ఆమె మృతికి ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం వీకే పాళ్యంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ధర్మలింగం తెలిపారు.

సాయి చంద్రయ్యకు నివాళి


నివాళులర్పిస్తున్న తారకశ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్తరాశిపాళెంకు చెందిన టైలర్ సాయి చంద్రయ్య ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చాంద్‌బాషా, ఆవుల శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, అశోక్, సుబ్బారావు, అబ్దుల్లా, జఫూర్, కందస్వామి, సుధ, రాజా, నాగేంద్ర పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల కడుపు కొట్టొద్దు

శ్రీకాళహస్తి: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం శ్రీకాళహస్తిలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్ చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్మిక సంఘంలో ఎక్కువ మంది మహిళలు పనిచేస్తున్నారని చెప్పారు. ఆ మహిళల కడుపులు కొట్టే విధంగా కొంతమంది అధికారులు పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ మహిళా కార్మికులకు అండగా ఏఐటీయూసీ ఉంటుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చినటువంటి వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. మధ్యాహ్నం భోజన మెనూ చార్జీలు ఒక్కరికి కనీసం 20 రూపాయలకు పైగా పెంచాలని, కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కార్మికులపై రాజకీయ వేధింపులు ఉండకుండా చూడాలని తిరుపతి జిల్లా కలెక్టర్ కార్మికులకు అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు శాంతి, సునీత, రాములమ్మ, మునీశ్వరి, అమ్ములు, రాజేశ్వరి దేవి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జనమాల గురవయ్య

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మస్థైర్యం


విద్యార్థులతో డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి: మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మస్థైర్యం, శారీరక దృఢత్వం ఏర్పడుతుందని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని సరోజిని కల్యాణ మండపంలో కెనీ షిటో ర్యూ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ, విద్యార్థులు కరాటేలోని బెల్ట్ ఫీడింగ్ ముఖ్యమైనదని తెలిపారు. ఒకస్థాయి నుంచి ఇంకొక స్థాయికి ఎదగడాన్ని రంగుల రూపంలో గుర్తించటం అని తెలిపారు. ప్రస్తుతం బ్లూ బెల్ట్ నుంచి గ్రీన్ బెల్ట్‌కు విద్యార్థులను అప్‌గ్రేడ్ చేశారని చెప్పారు. కార్యక్రమంలో సీఐ గోపి, వెంకటేశ్వర్లు, రవి నాయక్, తిమ్మయ్య , కరాటే కోచ్ ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తాం


నల్లగంగమ్మ

శ్రీకాళహస్తి: పట్టణంలోని బహదూర్‌పేట తేట్టు వద్ద వెలసిన శ్రీ శ్రీ నల్ల గంగమ్మ తల్లి జాతర ఈ నెల 26న నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ కంఠా రమేష్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. శ్రీకాళహస్తి పట్టణంతో పాటు చుట్టుపక్కల నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని ఆ తల్లి ఆశీర్వాదం తీసుకోవాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

'ఉల్లాస్' పరీక్షకు 444 మంది హాజరు

సత్యవేడు: మండలంలోని 21 కేంద్రాల్లో నిర్వహించిన ఉల్లాస్ పరీక్షకు నూతన అభ్యాసకులు 444 మంది హాజరయ్యారు. నూతన అక్షరాస్యులు మూడు నెలలుగా వాలంటరీ టీచర్ల శిక్షణలో రాయడం, చదవడం నేర్చుకున్నారు. వీరికి ఆదివారం పరీక్ష నిర్వహించారు. సత్యవేడు గిరిజన కాలనీలోని బీసీ బాలుర వసతి గృహ ఆవరణ నిర్వహించిన పరీక్షకు నూతన అక్షరాస్యులు హాజరై రాశారు. వెలుగు ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్ అందజేసిన ప్రశ్నా పత్రానికి జవాబులు రాశారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం ఉల్లాస్ పేరుతో వయోజన విద్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని చెప్పారు.


సత్యవేడు బీసీ బాలుర వసతి గృహ ఆవరణలో పరీక్షకు హాజరైన మహిళలు









ముక్కంటీశా.. చూస్తున్నావా?

శ్రీకాళహస్తిలో కూటమి కాలకేయులు చెలరేగిపోతున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి స్వర్ణమ్మను చెరబడుతున్నారు. ఓ టీడీపీ నేత హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మిస్తున్న తన ఇంటికి ఏకంగా 30 ట్రాక్టర్లు, జేసీబీ పెట్టి ఆదివారం రాత్రి స్వర్ణముఖి నది నుంచి ఇసుక తరలించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అతి సమీపంలోనే ఇసుక తవ్వేస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నా పోలీసులు సైతం నోరుమెదపలేదు. ఆలయానికి అటూ ఇటూ కిలోమీటరు చొప్పున ఇసుక ఎత్తరాదనే నిబంధన ఉన్నా ఆలయ అధికారులు సైతం దీనిపై స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

–శ్రీకాళహస్తి